ఖాళీకుర్చీ

మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి పందిట్లో కట్టిన పచ్చని మామిడాకుల తోరణాలు గాలికి అల్లలాడుతున్నాయి. పట్టుచీరల రెపరెపల్లో అత్తరు గుబాళింపులు చెలరేగి మత్తు గొలుపుతున్నాయి. కల్యాణ మండపంలో కూర్చునివున్న వధూవరులు రతీమన్మథుల్లాగ వున్నారు.

పెళ్ళికూతురు తండ్రి రామారావు పట్టుపంచ సర్దుకుంటూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతని ముగ్గురు తమ్ముళ్ళూ అన్నగారికి అండగా నిలబడి ఏర్పాట్లు చూస్తున్నారు.

రామారావు ఇండస్ట్రియలిస్టు, లక్షాధికారి, అంగబలం అర్థబలం వున్నవాడు. అతని పెద్దతమ్ముడు తాతారావు ఐ. ఏ. ఎస్. ఆఫీసరు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కలెక్టరుగా పనిచేస్తున్నాడు. రెండో తమ్ముడు రాజారావు ఇన్‌కంటాక్సు ఆఫీసరు. కలకత్తాలో వుంటాడు. మూడోవాడు మాధవరావు రైసుమిల్లు ఓనరు. ప్రేమకీ, ఆప్యాయతకీ, అనురాగానికీ వాళ్ళు అందరూ రాముని తమ్ముల వంటివారు ఈ అన్నదమ్ములు నలుగురికీ ముగ్గురు అప్పచెల్లెళ్ళు. అందరూ గవర్నమెంటు ఆఫీసర్ల భార్యలు. పచ్చపచ్చగా సంసారాలు చేసుకుంటూ పిల్లాపాపలతో సుఖజీవనం సాగిస్తున్నవాళ్ళు

పెళ్ళికి వూరు వూరంతా తరలివచ్చింది.

కొంచం అవతల పందిట్లో భోజనాలు సాగుతున్నాయి.

పెళ్ళి తతంగం ఆర్భాటంగా సాగిపోతున్నది. ముందు వరసలో సోఫాలో కూర్చుని అర్థ నిమీలిత నేత్రాలతో ఆనంద నిర్భరిత మయిన హృదయంతో గమనిస్తూవుంది అన్నపూర్ణమ్మ. రామారావు ఆమె జ్యేష్ఠ పుత్రుడు. ఇపుడు అతని కనిష్ఠ పుత్రిక వివాహం. పెళ్ళికొడుకు ఎక్సయిజు డిపార్టుమెంటులో పెద్ద ఆఫీసరు. సమానమయిన వియ్యం.

మంగళసూత్రధారణ జరుగుతోంది. ఒక యువతి పెళ్ళికూతురి జడని ఎత్తిపట్టుకుంది. పెళ్ళికొడుకు నిలబడి, వంగి మంగళ సూత్రం కట్టాడు. మంగళ వాయిద్యాలు మ్రోగాయి. అందరూ లేచివెళ్ళి అక్షింతలు వేసారు. అన్నపూర్ణమ్మని చిన్నపిల్లనిలాగ పొదివి పట్టుకొని నడిపించుకొని వెళ్ళాడు ఆమె పెద్దకొడుకు. అక్షతలు వేసి మనసారా ఆశీర్వదించింది. తిరిగి ఆమెని సోఫాలో కూర్చోపెట్టి వెళ్ళాడు రామారావు. రామారావు కొడుకు వచ్చి 'నానమ్మా, కూల్‌డ్రింక్ తాగు' అని అందించబోయాడు. 'వద్దురా' అని ఎంత మొత్తుకున్నా వినడు. బలవంతంచేసి తాగేదాకా వదిలిపెట్టలేదు. వాడు అంతే.

పెళ్ళికొడుకు పెళ్ళికూతురు తలంబ్రాలు పోసుకుంటున్నారు. సంతోషంతో అటు ఇటు పందిరంతా కలయజూసింది అన్నపూర్ణమ్మ. ఆమె చూపు తిరిగి తిరిగి ఒకచోట ఆగిపోయింది. రెండో వరసలో చివర కుర్చీలో కూర్చునివున్న ఒక వ్యక్తి — ఆమె దృష్టిని ఆకర్షించాడు. అతను బక్కపలచగా వున్నాడు. ఖద్దరుబట్టలు వేసుకునివున్నాడు. ఆబగా, అపేక్షగా, అనిమేషంగా పెళ్ళితంతును గమనిస్తున్నాడు.

అతను ఎవరి దృష్టికీ రాలేదు; అందర్నీ అతను గమనిస్తూవున్నాడు. అతన్ని గమనించి —

అన్నపూర్ణమ్మ గుండెలు గుబగుబలాడాయి.

మనసు రెపరెపలాడింది.

అచ్చం అదే పోలిక.

అన్నపూర్ణమ్మ గుండెలు ఎగసిపడినాయి. మరల మరల అటువేపు చూసింది ఆమె.

మనసు ఉత్తుంగ తరంగిత సముద్రంలాగా వూగిసలాడింది. ఏమేమో చేయాలని పించింది. ఏమీ చేయలేకపోయింది.

ఆమె చిన్నకూతురు రెపరెపలాడుతున్న పట్టుచీరతో అటుగా వచ్చింది. వచ్చి — 'అమ్మా! భోజనం చేసావా?' అని అడిగింది. లేదన్నట్టు తలాడించింది అన్నపూర్ణమ్మ.

పాలడుగు వెంకటేశ్వరరావు

అయితే పద. భోజనం చేద్దువుగాని' అంది కూతురు.

'ఇపుడు నేనేం తినలేనే.'

'కొంచం పెరుగేసుకు తిందువుగాని.' బలవంతంచేసింది కూతురు. ఇంతకుముందు ఆమె మిగతా కొడుకులూ, కూతుళ్ళూ అందరూ వచ్చి అలాగే ఆమెని అన్నం తినమని బలవంతం చేసారు. అందరూ అంతే. తల్లిని మల్లెపూవులాగ చూసుకుంటారు. అపురూపమయిన ఆప్యాయతల్ని అందించబోతారు. తల్లిని దైవసమానంగా చూసుకొనాలన్న ప్రయత్నం వాళ్ళ మాటలలో చేతలలో కన్పిస్తూ వుంటుంది. అదే ఆమె తృప్తి; ఆనందమూ.

కాని వయసు మీదపడింది. ఆమెకి ఓపిక తగ్గిపోయింది. తింటే అరగదు అందువలన ఆహారం తగ్గించింది. ఆరముగ్గిన పండులాగ అయింది.

చిన్నకూతురు ఆమెని వదిలిపెట్టలేదు. బలవంతాన ఆమెని రెక్కపుచ్చుకుని లేపి మెల్లగా నడిపించుకుని వెళ్ళింది. ప్లేటులో ఇంత అన్నం పెరుగూ పెట్టుకువచ్చి తినిపించింది. మూతి కడిగింది. ఆ తరువాత జాగ్రత్తగా తీసుకునివచ్చి సోఫాలో కూర్చోపెట్టింది తల్లిని.

పెళ్ళి చాలావరకు పూర్తవవచ్చింది. అరుంధతీ నక్షత్రం చూపించటం, చదివింపులూ అన్నీ అయ్యేయి. పెళ్ళికొడుకుని పెళ్ళికూతురుని లోపలికి తీసుకువెళ్ళేరు.

అన్నపూర్ణమ్మ దృష్టి రెండవ వరుసలో చివరి కుర్చీవైపు మళ్ళింది.

ఆమె గుండె గుబగుబలాడింది.

ఆ మనిషి — అచ్చం అదే పోలిక!

కాని ఇపుడు ఆ కుర్చీ కాళీగా వుంది!

అదేగాక పందిట్లో చాలా కుర్చీలు కాళీ అయేయి.

మనసే కాళీ అయినట్లనిపించింది ఆమెకి. గుండె మారుమూలలలో ఎక్కడో చిన్న కలక. కలవరం.

మంగళతూర్యరవాల మధ్యన మెడలో తాళి కట్టించుకున్న క్షణంలో అప్పుడు—కొన్ని దశాబ్దాల క్రితం — కొత్త పెళ్ళికూతురుగా ఎన్నో కలలుకంది. కడుపు పండాలని నూరేళ్ళు పచ్చగా కాపురం చేయాలని ఆశించింది. అందరు కన్నెపిల్లలులాగానే ఆశల పందిరి వేసుకుంది. కనిపెంచిన తలిదండ్రుల్ని, అన్నదమ్ముల్ని, అప్పచెల్లెళ్ళనీ అందర్నీ వదిలి — అతన్నే నమ్ముకుని అతనితో తరలి వచ్చింది.

బాగానే సాగింది తన సంసారం.

అందం అనురాగం, పాడీ పంటా, పిల్లాపాపా, ధాన్యం ధనం పుష్కలంగా వున్న సంసారం.

ఒకసారి 'అతని కారు' యాక్సిడెంటుకి లోనయింది. తలకి బలంగా దెబ్బతగిలింది. గాయం నయమయింది. కాని అప్పట్నుంచీ ఆ మనిషి మారిపోయారు.

అన్నపూర్ణమ్మకి ముగ్గురు అక్కలూ, నలుగురు అన్నలూ. అందరిలోకీ చిన్నది అవటంవలన గారంగా పెరిగింది. అన్నలు ప్రాణసమానంగా చూసుకునేవారు అక్కలు ఆమెని కాలు కిందపెట్టనిచ్చేవారుకారు. ఆప్యాయతలు, అభిమానాలు గుండెల్నిండా నింపుకుని గడిపిన రోజులవి.

ఇప్పుడు అన్నపూర్ణమ్మ వయసు ఎనభయి దాటింది. జీవితంలో అన్నీ చూసింది. స్నేహితులు, అక్కలు అన్నలు— తలిదండ్రులు అందర్నీ కాలరాక్షసి మింగివేసింది. ఆ విషయం జ్ఞాపకంవస్తే గుండె చెరువవుతుంది. అత్తారుబత్తరంగా గడిచిన బాల్యం, కేవలం జ్ఞాపకాలుగానే మిగిలిపోయింది. ఆరోజులు తిరిగి రావాలని—

ఆంధ్రసచిత్రవారపత్రిక

రచయితలకు గమనికలు

★ ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ ఇతర రచనలూ పంప దలచుకున్నవారు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీ నగరం, విజయవాడ–520 003 అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరు మీద శీర్షిక పేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి– హామీ పత్రం జత చెయ్యాలి.

★ గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి ఎనిమిది వారాల గడువు అవసరం.

★ కథలుగాని, యితర రచనలుగాని త్రిప్పి పంపబడాలని కోరుకునే వారు– వారి స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ల లంటించిన కవరు పెట్టడం అవసరం.

★ రచనల గురించి పంపిన వెంటనే గాక ఎనిమిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయం కోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కాని–తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయ వలసివస్తే రచయితలు– రచన పేరు– అది పంపిన తేదీ, వివరంగా వ్రాయందే, వాటి గురించి పరిశీలించడం కష్టం.

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ళ లంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

★ కార్టూన్లు పంపేవారు కూడా 8 వారాలలోగా మా మీద ఉత్తరాల వాడి చెయ్యకూడదు... ప్రతి కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్ల కవర్ పై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

★ కార్టూన్ల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలు వెంబడి జరుగుతుంది.

★ రచయితలకు కార్టూనిస్టులకు ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'పద్మ' వారికి తప్ప తతిమ్మా అందరికీ; అవి పద్మ "ప్రతు"లవ– కాల క్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము. కాపీలు టపాలో పోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు. సం.

చిరాలలో డిసెంబర్‌లో జరిగిన అఖిలభారత ద్వితీయ ఫొటోగ్రాఫీ ప్రదర్శనల్లో బహుమతి పొందిన ఫొటో టి. కాశీనాథ్ తీసినది.

కాళీ కుర్చీ

మరల ఒకసారి ఆ జీవితాన్ని పునశ్చరణ చేయాలని అనిపిస్తుంది. ఆ కోరిక గుండె లోతుల్లో కొట్టుమిట్టాడుతుంది. అది జరిగేపని కాదని తెలిసి మనసు నిట్టూరుస్తుంది. ఏడ్వలేక నవ్వు ఒకటి పెదాలపయిన పారాడుతుంది. అది జారిపోయిన స్మృతి. మధురగీతి. మరల అందుబాటులోనికి రానిది. తెమ్చుకొనలేనిది.

అన్నపూర్ణమ్మ చూపు మరల ఆ కాళీ కుర్చీల మధ్యన పారాడింది. ఎంతో ఆశతో వెతుకులాడింది. రెండోవరసలో వున్న ఆ చివరి కుర్చీలో కాకపోయినా మరే కుర్చీలోనయినా ఆ రూపు గల మనిషి కనిపిస్తాడేమోనని వెతుకులాడింది.

కేవలం పోలిక మాత్రమే.

పోలికని గుర్తించిన మనసు ఆశపడింది– అంతే.

కాని – కుర్చీలు కాళీగానే వున్నాయి.

నిరాశే ఎదురయింది.

ఆ నిరాశ మనసులో విషాదాన్ని నింపింది.

అప్పటినుంచీ – ఆ యాక్సిడెంటయిన

దగ్గరనుంచీ ఆయన పద్ధతి మారిపోయింది. మతి స్తిమితంగా వుండేదిగాదు. మనిషి ఇంటిపట్టున వుండేవారుకాదు. హఠాత్తుగా ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయేవారు. మరల ఎప్పుడో బుద్ధికుదిరినపుడు ఇల్లు చేరేవారు. మాసిన బట్టలు, లోతుకు పోయిన కళ్ళూ, పెరిగిన గడ్డము, పొడుచుకువచ్చిన శరీరంలోని ఎముకలూ. ఆ ఆకారంలో ఆ మనిషిని చూసి ఏడుపు వచ్చేది.

'ఇన్నాళ్ళు ఎక్కడికి వెళ్ళారు?'

'ఏమయిపోయారు?'

'మమ్మల్ని వదిలిపెట్టి యెలా వుండగలిగారు?'

'మీకు ఏం తక్కువ అయిందని అలాగ వెళ్ళిపోయారు?' ఇనన్నీ ప్రశ్నలు. కాని ఆ ప్రశ్నలకి సమాధానాలు లేవు.

పిచ్చిగా చూసేవారు. వెర్రిగా నవ్వేవారు. శూన్యంలోకి చూస్తూ వుండిపోయేవారు. ఆ రావటం, పట్టుమని నాలుగురోజులన్నా వుండటం జరిగేదిగాదు. మరల తిక్కపుట్టి ఎప్పుడో అదృశ్యమయిపోయేవారు. శూన్యాన్ని మిగిల్చి తన దారి తను చూసుకునేవారు. నిండయిన సప్పని జీవితంలో కాలి తొంగిచూసింది. బ్రతుకు ఆకాశంలో నల్లని మబ్బుతునక తొంగిచూసింది

పెళ్ళికూతుర్నీ, పెళ్ళికొడుకునీ బయటికి తీసుకువచ్చారు. మంచం వాల్చి ఎదురు బొదురుగా కూర్చోపెట్టారు. అంపకాలు జరుగుతున్నాయి.

పెద్దాడు కూతుర్ని అంపకంచేస్తున్నాడు. ఇన్నాళ్ళు అల్లారుముద్దుగా పెంచుకున్న కూతుర్ని అవతలవాళ్ళకి అప్పచెప్తున్నాడు. అన్నపూర్ణమ్మ గుండెలు బరువుగా మూలిగాయి.

బ్యాండువాళ్ళు అంపకాల పాట వాయిస్తున్నారు. చుట్టూరా నిలబడిన బంధుమిత్రులు బరువయిన మనస్సులతో చూస్తున్నారు. పెళ్ళికూతురు కళ్ళు వత్తుకుంది. తలిదండ్రులకి దండం పెట్టేటపుడు వాళ్ళని కావలించుకుని ఏడ్చింది. అది చూస్తున్న అందరి కనులూ చమర్చాయి.

తనూ కళ్ళు తుడుచుకుని అన్నపూర్ణమ్మ నలువయిపులా పారజూసింది అతనికోసం. వెతికింది. వ్యర్థప్రయత్నమే అని తెలిసినా— వెతుకులాట మానలేకపోయింది.

అలాగ ఎందుకయింది?

ఎందుకయింది?

అని ఎన్నోసార్లు ప్రశ్నించుకుంది అన్నపూర్ణమ్మ. ఎందుకయిందో కారణం ఎవరూ చెప్పలేకపోయారు. అలాగ కొన్నిసార్లు ఇల్లు వదిలి వెళ్ళి తిరిగివచ్చాక— ఒకసారి వెళ్ళిపోయిన మనిషి తిరిగి రానేలేదు. ఈనాటికీ ఆయన అయిపూ అజా లేదు. అందరూ ఆయన్ని మర్చిపోయేరు. తను మర్చిపోలేదు

అప్పటికి — పెద్దాడు రామారావు ప్రయోజకుడయినాడు. మిగతావాళ్ళు చిన్న చిన్న పిల్లలు. రామారావు బుద్ధిమంతుడు. తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ అతనే అన్నీ అయి పెంచాడు. ప్రయోజకుల్ని చేసాడు. తను కేవలం నిమిత్తమాత్రురాలుగానే వుండిపోయింది.

అప్పుడప్పుడు ఆమెకి అన్పిస్తుంది. వీళ్ళు అందరూ కలిసిమెలిసి ఒకే గూట్లో వుంటే బావుండునన్పిస్తుంది. కాని — రెక్కలు వచ్చి ఎగిరిపోయి స్వంత గూడు కట్టుకున్న పక్షుల్ని పాత గూటికి రమ్మంటే వీలయే పనా? ఉద్యోగ ధర్మాలు, జీవన వ్యాపారాలు వేరయి బ్రతుకు బండ్లని లాగుకుంటూవుండిన బిడ్డలు అందరూ ఒకచోటనే వుండటం అసాధ్యం గదా! నిజమే. కాని రెక్కలు వచ్చి విహరించే కోరికల్ని అరికట్టటం ఎలాగ? అందుకే అవి తీరని కోరికలుగా గుండెలోతుల్లోనే నిల్చిపోయాయి. బ్రతుకు చిత్రంలో మచ్చల్ని మిగిల్చాయి.

నలుగురూ అంటారు.

తనకేం లోటు. రాజుల్లాగ నాలుగు వయిపులా రాజ్యం చేస్తున్న నలుగురు కొడుకులు నిండుగా కాపురాలు చేసుకుంటున్న కూతుళ్ళు. మనవలు, మనవరాళ్ళు. అందరూ తనంటే ప్రాణం ఇస్తారు ఆప్యాయత చూపిస్తారు. కాళ్ళు కడిగి నెత్తిమీద చల్లుకుంటారు. తనకి ఏ లోటూ రాకుండా వుండాలని — ఆ వయసులో అన్నీ సజావుగా జరగాలని తాపత్రయపడతారు. ప్రయత్న లోపం రానీయరు. భక్తి, గౌరవం, అభిమానం, ఆప్యాయత అందిస్తారు.

వాళ్ళని చూసి అన్నపూర్ణమ్మ కడుపు నిండుతుంది. వాళ్ళ వినయపూర్వకమయిన, ఆప్యాయత నిండిన ప్రవర్తన ఆమెకి వెయ్యి ఏనుగుల బలం ఇస్తుంది.

కాని — ఏమిటీ చిత్రం?

ఈ జీవితం పరుగుపెడుతూవుంది! కాలంతోపాటు వురుకులు పరుగులమీద సాగిపోతుంది. దానివెంట అంగలు పంగలు వేసుకుంటూ వాళ్ళు సాగిపోతున్నారు. తమతోపాటు ఆమెనికూడా తీసుకుపోవాలని ప్రయత్నిస్తూవున్నారు. అందులో అసహజత్వం వుందనిపిస్తుంది. ఎక్కడో లోటు మిగిలివున్నట్లు కన్పిస్తుంది. వాళ్ళతో పాటు తను ఎన్నాళ్ళపాటు అలా నడక

మద్రాసులో కపాలేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు, ముక్కోటి ఏకాదశినాడు శ్రీ బి. రామలింగం సిద్ధాంతి శ్రీ ఎన్ టి.ఆర్ చేతిమీదుగా కిరీటధారణ చేయిస్తున్న చిత్రం

సాగించగలదు ? కాదని ఆగిపోయి, వాళ్ళని వదిలిపెట్టి ఎలాగ నిలబడిపోగలదు ?

తను ఏమయిపోతుంది ? ఏదో ఒకచోట తను ఆగిపోతే — అలాగ సాగి వెళ్ళిపోయిన 'వాళ్ళు' ఏమవుతారు ?

తనకి తోడుగా అయి—నీడని ఇవ్వవలసిన ఆ 'దేవుడు' ఏడి ? ఏమయిపోయాడు ? ఎందుకు ఇంత నిర్దయ ? పతినే ప్రత్యక్ష దైవంగా పూజించుకుంది మరి !

వాన కురిసి వెలిసినట్లయింది.

పెళ్ళివారు వెళ్ళి పోయారు. బంధు మిత్రులూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

రామారావు, అతని తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వాళ్ళ సంతానాలు మాత్రం మిగిలిపోయారు. నెత్తిమీదనుంచి పెద్ద బరువు దింపుకున్నట్లు అయింది. తలపెట్టిన శుభకార్యం చాలా బాగా జరిగిపోయింది. ఆ తృప్తితో - అన్నపూర్ణమ్మగారి వద్దకు వచ్చి కుర్చీ వాక్కని కూర్చున్నాడు రామారావు. అతని వెనకే తమ్ముళ్లు వచ్చారు. ఆవెంట చెల్లెళ్ళు, ఆ కోడికోడళ్ళూ వచ్చారు. అందరూ తలా ఒక కుర్చీ లాక్కుని అన్నపూర్ణమ్మ చుట్టూ

కాళీ కుర్చీ

పరివేష్ఠించారు. ముచ్చట్లు ప్రారంభించారు.

గుండెలోతుల ఆలోచన్లనుంచి బయట పడిన అన్నపూర్ణమ్మ తలతిప్పి చుట్టూరా చూసింది. తనను ఆవరించి —

కొడుకులు, కోడళ్ళు — కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు మనుమరాళ్ళు అంతా తన బలగమే. కొలువుతీరిన మహారాజ్ఞిలాగ అన్పించింది ఆమె.

ఆమె దృష్టివాళ్ళని దాటి పందిరంతా కలయదిరిగింది. ఆ పందిరంతా కాళీ కుర్చీలు. ఆ రెండో వరుసలో చివరి కుర్చీ కూడా కాళీగా బోసిగా మిగిలివుంది.

చివరికి ఈ బ్రతుకులూ ఇంతేనా ?

ఈ కాళీ — ఈ లోటు తీరేదికాదా ?

హఠాత్తుగా ఆమెకి భర్త గుర్తుకి వచ్చాడు. గుండెల్లో భయంకరమయిన అలలు లేచేయి. సంక్షుభితమయిన తుఫాను విజృంభించింది. ఆ తుపానుని నిగ్రహించుకోవటాన్కి ఆమె చాలా ప్రయత్నించవలసి వచ్చింది.

ఏమిటి ఈ కాళీ ? ఈ వెలితిని ఎలాగ భరించటం ?

ఎక్కడ తన 'దేవుడు ?' ఆయన ఎందుకు రారు ?

పచ్చపచ్చగా పరివేష్టించి ముచ్చట్లాడుతున్న ఈ చిన్నారుల్ని నిండుమనసుతో దీవించవలసిన ఆ 'పురుషోత్తముడు' ఏడి ?

ఆ తలపు మనసుని కలవరపరచగా — అన్నపూర్ణమ్మ వలవలా ఏడిచింది.

'అమ్మా ! ఏమయింది ?' అంటూ ఆత్రుతతో, కంగారుగా దరిచేరిన పెద్దాడు రామారావు వడిలో మొహం దాచుకుని పసిపిల్లలాగ ఏడిచింది ఆమె.

'అమ్మా అమ్మా' అంటూ కళవళ పడ్డారు ఆమె పిల్లలు.

కాసేపటికి అన్నపూర్ణమ్మ తెప్పరిల్లింది. విషాదాన్నుంచి బయటపడింది. కొడుకులు చన్నీళ్ళతో ఆమె మొహం కడిగారు. కూతుళ్ళు తువ్వాలుతో తుడిచారు. కోడళ్ళు పరిచర్యలు చేసారు.

'అమ్మా, ఎందుకే? అలా ఏడ్చావేంటి?' అని అడిగాడు రామారావు.

'మన పద్మ వెళ్ళిపోయిందిగదా. అందుకు దుఃఖాన్ని ఆపుకోలేకపోయానురా' అంది అన్నపూర్ణమ్మ. అసలు సంగతి చెప్పటానికి ఆమె సిగ్గుపడింది. 'ఇందులో తప్పేదేముందమ్మా ! ఆడపిల్ల అత్తారింటికి వెళ్ళాలి. మగబిడ్డ అయితే ఏ ఉద్యోగమో వెతుక్కుంటూ వెళ్ళాలి. ఇది విధాయకమే గదా' అంటూ సర్దిచెప్పబోయిన రామారావు, తన కూతురు పద్మ వెళ్ళిపోయిందన్న ఆ తలపు తెచ్చిన విషాదాన్ని అణచుకోవాలని ప్రయత్నించాడు. అతని మొహం మ్లానంగా అయింది. అతని భార్య లేచి లోపలికి వెళ్ళింది — దుఃఖాన్ని ఆపుకోలేక.

ఆసరికి పందిరి కాళీ అయింది.

పనివాళ్ళు వచ్చి కాళీ కుర్చీల్ని మడిచి, లెక్కపెట్టుకుని లారీలో వేసుకుపోయారు.

అన్నపూర్ణమ్మ మనసుని ఆవరించిన విషాదం అప్పటికి పూర్తిగా తొలగిపోయింది. నలుగురితోపాటు తనూ ముచ్చట్లలో పడింది — లవుకిక జీవన వ్యాపారంలో ఆమె మనసు లగ్నమయింది.